క్లుప్తంగా

శ్రీముఖలింగానికి భక్తుల తాకిడి



క్యూలో ఉన్న భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడి దర్శనానికి ద్వాదశి సందర్భంగా ఆదివారం భక్తులు పోటెత్తారు. వరసుగా శని, ఆదివారాలలో సెలవులు రావడంతో స్వామి దర్శనానికి జిల్లా నలుమూలలతోపాటు విజయనగరం, విశాఖ జిల్లాలతో పాటు, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వంశధార నదిలో పుణ్యస్నానాలు అచరించి స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.

ఏపీ పీఆర్ మినిస్టీరియల్ సంఘం జిల్లా కార్యదర్శిగా మూర్తి



నరసన్నపేట: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా స్థానిక మండల పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.నర్సింహమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాకుళంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా కార్యవర్గ ఎన్నిక జరిగిందని మూర్తి తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించారని, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మినిస్టీరియల్ నరసన్నపేట తాలూకా సంఘ అధ్యక్షుడిగా కూడా మూర్తి ఇటీవల ఎన్నుకున్నారు.

తిరుమలకు లక్ష్మీనరసింహ భక్త బృందం



తిరుమలకు వెళ్తున్న లక్ష్మీనరసింహ భక్త మండలి సభ్యులు

నరసన్నపేట: తిరుమల ఆస్థాన మండపంలో విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణానికి నరసన్నపేట నుంచి 20 మంది లక్ష్మీనరసింహ భక్త బృందం తిరుమలకు ఆదివారం పయనమైంది. ఆగష్టు ఒకటిన తిరుమల ఆస్థాన మండపంపై విష్ణు సహస్ర నామ స్తోత్రం పారాయణం చేయనున్నట్లు భక్త బృందం ప్రతినిధి సంతోషి తెలిపారు. గతంలో రెండు మార్లు ఇలా పారాయణం చేయడానికి వెళ్లామని తెలిపారు. ఇటువంటి అవకాశం మళ్లీ రావడం పట్ల భక్త బృందం సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న ఉపాధి సిబ్బంది

సారవకోట: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మండల కేంద్రంలో ఆదివారం 9 గ్రామాల రైతులకు సంబంధిత సిబ్బంది మొక్కలు పంపిణీ చేశారు. దీంట్లో 5125 జీడి, 1750 కొబ్బరి, 250 మామిడి మొక్కలను 225 మంది రైతులకు అందజేశారు. ఈ 9 గ్రామాల్లోని చెరువుల గట్లుపై కొబ్బరి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఉపాధి సిబ్బంది తెలిపారు.

నేడు షళంత్రిలో గడపగడపకు మన ప్రభుత్వం

సరుబుజ్జిలి: మండలంలోని షళంత్రి గ్రామ పంచాయతీలో సోమవారం మధ్యాహ్నా 3 గంటల నుంచి శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆమదాలవలసలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

● ముమ్మరంగా దమ్ములు



నడగాం వద్ద దమ్ము చేస్తున్న రైతు



గుండవల్లిపేట వద్ద ఉభాల కోసం పొలంలో నారు కట్టలు వేసిన దృశ్యం

నరసన్నపేట మండలంలో ఖరీఫ్ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వరి వెదలు 60 శాతం వేయగా.. మిగిలిన విస్తీర్ణంలో దమ్ములు చేపడుతున్నారు. గత వారంలో వర్షాలు అధికంగా కురవడంతో నీరు అందివచ్చింది. కాలువల ద్వారా కూడా నీరు పుష్కలంగా వస్తోంది. మండలంలో 8 వేల హెక్టార్లలో వరి సాధారణ విస్తీర్ణం. ఈ మేరకు ఆగస్టు 15 కల్లా ఉభాలు పూర్తికావచ్చని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. మండలంలో గుండవల్లిపేట, సత్యవరం, కరగాం, నారాయణవలస, కోమర్తి, నగడాం, ఉర్లాం తదితర గ్రామాల్లో దమ్ములు ముమ్మరంగా చేపడుతున్నారు. ఈ ఖరీఫ్‌లో 10 రోజులు ముందుగా ఉభాలు పూర్తికావచ్చని వ్యవసాయాధికారి కె.సునీత అన్నారు.

–నరసన్నపేట

● పొలం పనుల్లో బిజీ.. బిజీ..

కొత్తూరు మండలంలోని 27 రైతు భరోసా కేంద్రాల పరిధిలో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో విస్తారంగా వర్షాలు కురవడంతో పొలాల్లో నీరు చేరడంతో గత వారం రోజులు నుంచి దమ్ములు సాగుతున్నాయి. మండలంలో 5,200 హెక్టార్లలో వరినాట్లు వేసేందుకు లక్ష్యంగా చేయగా.. ఇందులో 70 శాతం (3550 హెక్టార్ల)లో వరి వెదలు వేశారు. మిగిలి ఉన్న 1650 హెక్టార్లలో ఇంతవరకు సుమారు వేయి ఎకరాల్లో వరినాట్లు వేశారు. మండలంలోని మొత్తం సాగు భూమి వర్షాధారం కావడంతో వర్షాలు కురిసినందున వరి నాట్లు వేసే పనిలో రైతులు బిజీగా ఉన్నారు.

-కొత్తూరు



కుంటిభద్రలో వరి నాట్లు వేస్తున్న మహిళలు

డ్రమ్ సీడర్‌తో.. అధిక లాభాలు



తీమర గ్రామంలో డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేస్తున్న రైతు

- నియోజకవర్గంలో 280 ఎకరాల్లో సాగు
- ఎకరాకు 40 నుంచి 45 బస్తాల దిగుబడి
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు

పాతపట్నం: అధునాతన పద్ధతుల్లో రైతులు సాగు చేసేందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు నడుంబిగించారు. తక్కువ సమయంలో స్వల్ప పెట్టుబడులతో అధిక దిగుబడులను సాధించేందుకు రైతులకు దారి చూపిస్తున్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి కూలీలతో పనిలేకుండా డ్రమ్‌సీడర్ ద్వారా సాగు చేసేందుకు రైతులకు శిక్షణ ఇస్తున్నారు. డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేస్తే ఎకరాకు 40 నుంచి 45 బస్తాల వరకు దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు, ఇప్పటికే ఈ విధానంలో పండిస్తున్న రైతులు చెబుతున్నారు.

నారుమడితో పనిలేదు..

డ్రమ్‌సీడర్ ద్వారా సాగు చేసేందుకు ఎకరాకు 16 కేజీల విత్తనాలను సిద్ధం చేసుకోవాలి. వరి నారుమడి లేకుండా నేరుగా దమ్ము పట్టి విత్తనాలు నాటుకోవాలి. విత్తనాలు నాటిన మూడ్రోజుల తర్వాత కలుపు మందు వేసుకోవాలి. ఎకరాకు బస్తా డీఏపీ, యూరియాలను కలిపిన మిశ్రమాన్ని మూడు సార్లు వేయాలి. సంప్రదాయ వరి సాగులో ముందుగా ఆకు మడి తయారు చేయాలి. తర్వాత కలుపు నివారణ చేపట్టాలి. అనంతరం ఆకు తీత, ఉడుపు, కలుపు తీత లాంటి పనులకు కూలీల అవసరం ఉంటుంది. సాధారణంగా ఎకర వరి సాగుకు రూ.15 వేలు వరకు ఖర్చువుతుంది. నేరుగా డ్రమ్‌సీడర్‌తో సాగు చేస్తే ఎకరాకు ఐదువేలు వరకు ఆదా అవుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

నియోజకవర్గంలో..

పాతపట్నం మండలంలోని పాతపట్నం, కాపుగోపాలపురం, గంగువాడ, లాబర, సింగుపురం, సీది, కొరసవాడ, తీమర గ్రామాల్లో 230 ఎకరాల్లో, మెళియాపుట్టి మండలంలోని కొసమాల, పట్టుపురం, పెద్దపద్మపురం, మర్రిపాడు–సి గ్రామాల్లో 35 ఎకరాల్లో, ఎల్.ఎన్.పేట, హిరమండలం మండలాల్లో 8 ఎకరాల్లో డ్రమ్ సీడర్ ద్వారా పలు రకాల విత్తనాలను నాటారు. శాస్త్రవేత్తలు, అధికారుల పర్యవేక్షణలో సాగు చస్తుండటంతో మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశతో ఉన్నారు.

పెట్టుబడి తగ్గుతుంది



డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగు చేసే ఐదు వేల వరకు పెట్టుబడి తగ్గుతుంది. కూలీలతో నిమిత్తం లేకుండా సాగు చేయచ్చు. దిగుబడులు కూడా సంప్రదాయ సాగుతో పోల్చుకుంటే అధికంగానే వస్తున్నాయి. ఎరువులు, రసాయనాల వాడకం కూడా తగ్గింది. డ్రమ్ సీడర్‌తో సాగు లాభదాయకంగా ఉంది.

– వంజరాపు చిట్టయ్య, రైతు, పాతపట్నం

అవగాహన కల్పిస్తున్నాం..



ఆధునిక పద్ధతుల్లో సాగు చేసేందుకు రైతులకు విస్తతంగా అవగాహన కల్పిస్తున్నాం. డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేసే ప్రక్రియను వ్యవసాయ శాస్త్రవేత్తలను సంప్రదించి మరీ రైతులకు సమాచారం ఇస్తున్నాం. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నాలుగేళ్లుగా డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేస్తున్నారు.

– ఎల్.వి.మధు, ఏడీఏ వ్యవసాయశాఖ, పలాస

పాతపట్నంలో నిఘానేత్రాలు



పాతపట్నంలోని అంతరాబ కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

పాతపట్నం: పట్టణంలో వాహనల కదలికలపైనే కాదు, అనుమానితులపై కూడా నిఘానేత్రాన్ని స్థానిక పోలీసులు ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆర్టీసీ కాంపెక్స్, ఆల్ ఆంధ్రా రోడ్డు జంక్షన్‌లో మూడు సీసీ కెమెరాలు, నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం జంక్షన్‌లో మూడు సీసీ కెమెరాలు, పోలీసు స్టేషన్ వద్ద మూడు సీసీ కెమెరాలు ఆదివారం అమర్చారు. వీటిని జిల్లా ఎస్పీ కార్యాలయానికి నేరుగా కనెక్ట్ చేశారు. దీంతోపాటు పాతపట్నం పోలీస్‌స్టేషన్ (సర్కిల్) వద్ద సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్‌కు మరో ఆరు కెమెరాలను రాష్ట్ర సరిహద్దు ఆర్టీసీ కాంప్లెక్స్, అంతరాబ కూడలి, సెయింటెన్స్ స్కూల్, బస్ స్టాండ్ సమీపం, ఆల్ ఆంధ్రా రోడ్డు, నీలమణిదుర్గ ఆలయం కూడలిలో ఏర్పాటు చేశారు. ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాల మార్గంతోపాటు ఒడిశా, మెళియాపుట్టి, టెక్కలి, శ్రీకాకుళం మార్గం వైపు కూడా నిరంతరం నిఘా ఉండేలా సీసీ కెమెరాలు అమర్చారు. ఈ కెమెరాల్లో నిక్షిప్తమైన సమాచారాన్ని నేరుగా సర్కిల్ కార్యాలయానికి, జిల్లా ఎస్పీ కార్యాలయానికి కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మణిపూర్ బాధితులకు న్యాయం చేయాలి



సరుబుజ్జిలి: సరుబుజ్జిలి జంక్షన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: మణిపూర్ ఘటనలో బాధితులకు న్యాయం చేయాలని క్రైస్తవ మ్యారేజ్ జిల్లా రిజిస్ట్రార్ ప్రత్తిపాటి ప్రసాదరావు కోరారు. స్థానిక కృపామందిరం చర్చి ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా శాంతి ర్యాలీని మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఘటనకు బాధ్యులైన దోషుల పట్ల కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో సిక్కోలు సేవా సంఘం మండల చైర్మన్ కల్పన, యూత్ అధ్యక్షుడు పీవీ బాబు, ఇల్లాకుల అప్పలసూరి, సవలాపురం నీలయ్య, పలువురు క్రైస్తవ ఆరాధకులు పాల్గొన్నారు.

కొత్తూరు: మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు, హత్య ఘటనలకు నిరసనగా మండలంలోని కొత్తగూడలో ఆదివారం రాత్రి ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మక అప్పన్న మాట్లాడుతూ.. మణిపూర్ సంఘటనకు కారకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

రహదారి నిబంధనలు పాటించాలి



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్

పాతపట్నం: వాహనదారులు రహదారి నిబంధనలు పాటిచాలని పాతపట్నం ఎస్‌ఐ మహమ్మద్ యాసీన్ అన్నారు. ద్విచక్రవాహనాలు నడిపిన మైనర్లకు, వారి తల్లిదండ్రులకు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల జరుగుతున్న ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ఉన్నవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే పాతపట్నం అభివృద్ధి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాతపట్నం: పాతపట్నం నియోజవర్గం అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే రెడ్డి శాంతికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా వీవర్స్ అధ్యక్షుడు మంచు చంద్రయ్య, ఏఎంసీ అధ్యక్షుడు కె.అర్జునరావు, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ వై.సూర్యం అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎవరి సిఫార్సులు లేకుండా.. ప్రభుత్వమే ప్రజల ఖాతాల్లోకి సంక్షేమ పథకాలు జమ చేస్తుందన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే నియోజకవర్గంలోని గిరిజన గూడలకు బీటీ రహదారులు, కాగువాడ–రొమదల మధ్య మహేంద్రతనయ నదిపై బ్రిడ్జి, అన్ని మండలాలకు తాగునీరు అందించామన్నారు. టీడీపీ నాయకులు మాయమాటలు చెప్పుకుంటూ గ్రామల్లో తిరుగుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గత పాలనలో జన్మభూమి కమిటీల సిఫార్సులకు, టీడీపీ కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలు అందాయని ఆరోపించారు. 2014లో వైఎస్సార్‌సీపీ బీఫాంపై గెలిచిన మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పార్టీ ఫిరాయించి.. నేడు ఎమ్మెల్యే రెడ్డి శాంతిని విమర్శంచడం సరికాదన్నారు. వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్, అమ్మవారి ఆలయం చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ తాతయ్య, గోపాలరావు, వరదరాజులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బూర్జ: డొంకలపర్తలో మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు



పొందూరు: రామసాగరం చెరువు వద్ద మొక్కలు నాటుతున్న కళింగ యూత్ అసోసియేషన్ సభ్యులు

బూర్జ/నరసన్నపేట/పొందూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పలువురు వ్యక్తులు పిలుపునిచ్చారు. బూర్జ మండలం డొంకలపర్తలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువు గట్టులపైన, రహదారికి ఇరువైపులా ఆదివారం బూర్జ జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు మొక్కలు నాటారు. వైకుంఠపురం గ్రామ పంచాయతీలో సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసూర్యనారాయణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలకంఠరావు పాల్గొన్నారు. నరసన్నపేట నియర్ కళాశాల మైదానంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సదాశివుని కృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. క్లబ్ ప్రతినిధులు ఊణ్ణ రంగనాథ్, వి.నాగరాజు, పొట్నూరు రమేష్, ఊణ్ణ వెంకటేశ్వరరావు, రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు మండలం పిల్లవలస గ్రామంలో గల రామసాగరం చెరువు వద్ద కళింగ యూత్ అసోసియేషన్ సభ్యులు పలు రకాల మొక్కలను నాటారు. అసోసియేషన్ సభ్యులు నర్సింగరావు, చక్రధరరావు, సత్యప్రసాద్, వావిలపల్లి సాయి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: మొక్కలు నాటుతున్న కృష్ణ, తదితరులు

ఫుట్‌బాల్ టోర్నీలో నరసన్నపేట సత్తా



ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులు

నరసన్నపేట: ఆంధ్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర స్థాయిలో నిర్వహించిన సబ్ జూనియర్స్ ఫుట్ బాల్ టోర్నమెంట్‌లో నరసన్నపేట జట్టు సత్తా చాటింది. విశాఖ జిల్లా కొమ్మాదిలో 13 ఏళ్ల లోపు వయస్సున్న వారికి ఈ పోటీలు ఆదివారం నిర్వహించారు. దీంట్లో నరసన్నపేట జూనియర్ కళాశాల మైదానానికి చెందిన జట్టు రెండో స్థానం సాధించి.. జిల్లా నుంచి సత్తా చాటిందని కోచ్ రాకేష్ తెలిపారు. క్రీడాకారులకు మరింత శిక్షణ ఇస్తే జిల్లాకు, నరసన్నపేటకు మంచిపేరు తీసుకువస్తారని కోచ్ అన్నారు. స్పాన్సర్స్(దాతలు) ముందుకు రావాలని కోరారు.

దొంగల భయం

పొందూరు: మండలంలో దొంగతనాలు జోరుగా జరుగుతున్నాయి. రాపాక కూడలికి సమీపంలో కుమ్మరి కాలనీలో నివాసం ఉంటున్న కె.దుర్గాప్రసాద్‌కు చెందిన బైక్ శుక్రవారం రాత్రి చోరీకి గురైంది. గుర్తుతెలియని దొంగలు పట్టుకుపోయారు. ఇంటి ముందు రాత్రి పార్కింగ్ చేసిన బైక్ శనివారం ఉదయానికి కనిపించకపోవడంతో స్థానిక పోలీసు స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల 13న కూడా రాపాకలో ఆంజనేయ ఆలయం సమీపంలో రాజారావుకు చెందిన బైక్ చోరీకి గురైంది. వారం రోజుల క్రితం పొందూరు ఖాదీ బాండారు సమీపంలో, అంబేడ్కర్ కూడలిలో, రాపాక కూడలిలోని కిరాణా దుకాణాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. సంబంధిత వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల మండలంలో వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. రాత్రి వేళల్లో నిఘా పెంచాలని పోలీసులను ప్రజలు కోరుతున్నారు.

భూగర్భ జలాల పెంపుపై అవగాహన



అలుదులో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సారవకోట: మండలంలోని అలుదు గ్రామానికి చెందిన శాంతి స్వరూప్ యుజన సంఘం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో భూగర్భ జలాల పెంపుపై తప్పెట గుళ్ల ప్రదర్శన చేపట్టారు. నెహ్రూ యువ కేంద్రం వారి సూచన మేరకు వర్షం నీటిని ఒడిసి పట్టడంపై అవగాహన కల్పిస్తున్నారు. భూగర్భ జలాలు పెరిగితే భవిష్యత్‌కు ఉపయోగపడుతుందని వివరించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తే రైతుకు గిట్టుబాటుగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు సబ్ డివిజన్ యాంకర్ బాబాజీ అన్నారు. కొత్తూరులో ఎన్‌పీఎం షాపును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబాజీ మాట్లాడుతూ సహజ వనరులతో తయారు చేసిన పలు రకాల కషాయాలతో పంటలకు ఎరువులుగా వినియోగించడంతో తక్కువ పెట్టుబడిలతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, మీనామృతం వంటి కషాయాలు తయారు చేయడంపై మహిళా రైతులకు శిక్షణ ఇచ్చారు. మీనామృతం కూరగాయల పంటలకు ఎక్కువగా ఉపయోగపడుతుందన్నారు. ప్రతీ రైతు తనకు ఉన్న భూమిలో కొంత విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అల్లు మాధవి, సీహెచ్ రమణమ్మ, శ్రీలత, సుభాషిణి, భూదేవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ప్రత్యేక యాప్

నరసన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ కోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్ (టీహెచ్‌ఆర్ ఎఫ్ఆర్ఎస్)ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆగష్టు రెండో తేదీ నుంచి ఇంటికే పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం ప్రారంభించనున్న నేపథ్యంలో ఆదివారం స్థానిక అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయంలో కార్యకర్తల మొబైల్స్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేశారు. పీఓ నాగమణి మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని కేంద్రాల్లో 80 శాతం మేరకు యాప్ డౌన్‌లోడ్ చేశామని, మిగిలిన వారికి సోమవారం నిర్వహిస్తామన్నారు. ఈ యాప్‌లో కార్యకర్తలు, లబ్ధిదారుల ఫేష్ రీడింగ్ నమోదు అవుతుందన్నారు. దీని వల్ల ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పక్కదోవ పట్టే అవకాశాలు తక్కువ అన్నారు. ఆగస్టు రెండో తేదీ నుంచి ప్రభుత్వం ఇంటింటికీ వైఎస్సార్ పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేయనుందన్నారు. ఒక్కో కిట్‌లో మూడు కేజీల బియ్యం, పప్పు, ఆయిల్‌తో పాటు ఇతర పదార్థాలు ఉంటాయన్నారు.





